సాక్షి
చిత్తూరు
గురువారం। 5। సెప్టెంబర్। 2024



వరద బాధితులకు బియ్యం

చిత్తూరు అర్బన్: విజయవాడ వరద బాధితులకు చిత్తూరు నగరపాలక సంస్థ వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శులు పది బస్తాల బియ్యాన్ని అందించారు.



అర్బన్‌హెల్త్ సెంటర్ తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని చవటపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ తనిఖీ చేశారు.



ప్రశాంతంగా చవితి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలని ఆర్డీఓ చిన్నయ్య అన్నారు.

న్యూస్‌రీల్

రెఫరల్ కేసులు తగ్గించండి

వైద్యులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



పుంగనూరు ఏరియా ఆస్పత్రి డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పుంగనూరు: ఏరియా ఆస్పత్రుల నుంచి రోగులను ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయడం తగ్గించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ డాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలించారు. రోగులను వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. వసతులు, మందుల స్టాక్ వివరాలను మెడికల్ ఆఫీసర్ మధుసూదన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో నూతన భవనాలను త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. గర్భిణులకు తక్షణం వైద్యసేవలు అందించేలా డాక్టర్లు కృషి చేయాలని, త్వరలోనే గైనకాలజిస్టును నియమిస్తామని తెలిపారు. అలాగే డాక్టర్లు, సిబ్బంది కొరతను భర్తీ చేస్తామని, రోగులకు 24 గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అలాగే అవసరమైన మందులు ఎప్పటికప్పుడు స్టాక్ ఉండేలా చూస్తామన్నారు. నిధుల సమస్యలు కూడా 10 రోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం రేపు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ గ్లోరియా తెలిపారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ, విద్య, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, డీపీఓ, హౌసింగ్, ట్రాన్స్‌కో, పీఆర్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, శాఖలపై చర్చ ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులు సమాచారంతో కార్యక్రమానికి రావాలని వివరించారు.

బ్రహ్మోత్సవాలకు నిరంతరం విద్యుత్

– ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు



మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: కాణిపాకం బ్రహ్మోత్సవాలకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఇవ్వడానికి కృషి చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. బుధవారం రూరల్ డివిజన్ కార్యాలయంలో చిత్తూరులోని విద్యుత్ అధికారులతో సమావేశమయ్యారు. శుక్రవారం నుంచి ఈనెల 27 వరకు అధికారులు స్థానికంగా 24 గంటలు అందుబాటులో ఉండేలా డ్యూటీలు వేశామన్నారు. అలాగే విద్యుత్ సమస్యలపై 9440814263 నంబరుకు వాట్సాప్ చేయాలన్నారు.

ఎంసీబీలు పెట్టుకోండి..

వ్యవసాయ సర్వీసుదారులు ఎంసీబీలు పెట్టుకుంటే ప్రమాదాలు జరగవని, షార్ట్‌సర్క్యూట్ అయ్యే అవకాశం ఉండదన్నారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు మూడు అంచెల విధానాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

విఘ్న నాశకా.. వినాయకా

ఆదిదేవుడిగా తొలి పూజ అందుకునే కాణిపాకం వరసిద్ధి వినాయకుడు చవితి వేడుకలకు సిద్ధమయ్యాడు. విఘ్నాలు తొలగించు స్వామీ అని భక్తులు ఆర్తించేది గణనాథుడినే. సిద్ధి, బుద్ధిని ప్రసాదించే వరసిద్ధి వినాయకుడు అన్ని కార్యాలకు సుప్రసిద్ధి. విఘ్నేశ్వరున్ని పూజిస్తే సకల శుభాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అసత్యాలు చెబితే శిక్ష తప్పదని ఈక్షేత్రం నానుడి. ఇంతటి మహత్యం కలిగిన కాణిపాకం వరసిద్ధి వినాయకుడి ఆలయం శతాబ్దాల చరిత్ర పుటల్లోకి ఎక్కింది. చవితి సందర్భంగా ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు ఎంతో ప్రత్యేకం. ఈ నెల 7వ తేదీ నుంచి వినాయక చవితి బ్రహ్మోత్సవ నిర్వహణకు దేవస్థానం ముహూర్తం ఖరారు చేసింది.



కాణిపాకం దేవస్థానం (ఫైల్)

- కాణిపాకంలో 7 నుంచి బ్రహ్మోత్సవాలు
- పటిష్ట ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- అధిక సంఖ్యలో భక్తులు రావచ్చని అంచనా
- 17నుంచి ప్రత్యేక ఉత్సవాలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు దేవస్థాన అధికారులు సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 7 నుంచి 27వ తేదీ వరకు ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రతిరోజూ స్వామి వారు వివిధ వాహన సేవల్లో విహరించనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా అభిషేక పూజలు జరగనున్నాయి. భక్తుల తాకిడి పెరగవచ్చని అంచనా వేసిన అధికారులు ముందస్తుగా పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నారు.

సత్య ప్రమాణాలకు నెలవు..

చెడు అలవాట్లు వదులుకోవడం కోసం తప్పులు చేస్తున్నారని..తప్పుడు కూతలు కూస్తున్నారని, ఆస్తి తగదాల్లో ఇతరాత్ర విషయాల్లో కాణిపాకం వెళదాం..ప్రమాణం చేద్దాం..అనే మాట ఇప్పటి కూడా గట్టిగా వినపడుతుంటోంది. ఇక్కడ అబద్ధం చెప్పడానికి ఎంత పెద్ద వారైనా వెనుకాడతారు. స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణం చేస్తే శిక్ష పడుతుందని భక్తుల ప్రగాఢవిశ్వాసం. అందుకే ఏ ప్రమాణం చేయాలన్నా, ముందు కాణిపాకం వరసిద్ధి వినాయకుడి మీద ప్రమాణం చేసి చెప్పాలని చెబుతుంటారు. వ్యసనాలకు బానిస అయిన వారిని ఇక్కడకు తీసుకొచ్చి ఇక మీదట వాటి జోలికి పోనని ప్రమాణం చేయిస్తుంటారు. స్వామివారికి భయపడి ఆ వ్యసనాల నుంచి దూరమైనవారు వేలసంఖ్యలో ఉంటారు.

చరిత్రలో నిలిచిపోయేలా..

బహుదానది ఒడ్డున వెలసిన శ్రీ కాణిపాకం వినాయక స్వామికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. చోళుల కాలంలో ఆలయం నిర్మితమైనట్లు పూర్వీకులు చెబుతున్నారు. 11వ శతాబ్దం.. కుళతుంగ చోళరాజు పాలనలో ఆలయ నిర్మాణం జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో(2021) ఆలయం జీర్ణోద్ధరణకు నోచుకుంది. పొడవు, వెడల్పు ఎత్తు పెంచారు. కృష్ణశిల రాయి తీసుకొచ్చి నిర్మాణం పూర్తి చేశారు. భారతీయ శిల్పకళ ఉట్టిపడేలా బొమ్మలు చెక్కారు. ఆలయానికి కొత్తరూపం తీసుకొచ్చారు. సుమారు రూ.9.6 కోట్లతో ఆలయ పునఃనిర్మాణం చేపట్టగా, 2022 ఆగస్టు 21వ తేదీన మహాకుంభాభిషేకం నిర్వహించారు.

తేదీ	పగలు సేవలు	రాత్రి సేవలు
7-9-24	వినాయకచవితి,పుష్పకావళ్లతో ప్రారంభం గ్రామోత్సవం	
8న	ధ్వజారోహణం	హంసవాహనం
9	నెమలివాహనం	బంగారు నెమలివాహనం
10	మూషిక వాహనం	
11	బంగారు చిన్న శేషవాహనం	బంగారు పెద్దశేషవాహనం
12	చిలుక వాహనం	వృషభ వాహనం
13		గజవాహనం
14	రథోత్సవం	
15	భక్తాండి వాహనం	తిరుకల్యాణం (సాయంత్రం) వడాయత్తు వాహనం
16	ధ్వజావరోహణం	వడాయత్తు ఉత్సవం ఏకాంతసేవ

ప్రత్యేక ఉత్సవాలు

తేదీ	వాహనసేవ
17న	అధికార నంది వాహనం
18న	రావణబ్రహ్మ వాహనం
19న	యాళి వాహనం
20న	విమానోత్సవం
21న	పుష్పపల్లకి
22న	కామధేను వాహనం
23న	సూర్య ప్రభవాహనం
24న	చంద్ర ప్రభవాహనం
25న	కల్ప వక్షవాహనం
26న	పూలంగిసేవ
27న	తెప్పోత్సవం

తీరని విషాదం

- ఇరు కుటుంబాల మధ్య సాన్నిహిత్యం
- వివాహేతర సంబంధానికి దారి తీసిన వైనం
- పురుగుల మందు తాగి ఇద్దరు మృతి





మృతులు రామచంద్ర, శోభ

రామకుప్పం: వివాహేతర సంబంధం కారణంగా రెండు కుటుంబాల్లో విషాదం మిగిలింది. పోలీసులు తెలిపిన వివరాలు.. శాంతిపురం మండలం శిలమాకులరాయి గ్రామానికి చెందిన రామచంద్రకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. టిప్పర్ నడుపుతూ కుటుంబంతో కలసి బెంగళూరులో ఉంటున్నాడు. కొన్ని నెలల కిందట రామచంద్ర వద్ద హిందూపురానికి చెందిన గిరీష్ డ్రైవర్‌గా చేరాడు. వారి కుటుంబాల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ నేపథ్యంలో గిరీష్ భార్య శోభతో రామచంద్రకు వివాహేతర సంబంధం ఏర్పడింది. పది రోజుల నుంచి రామచంద్ర, శోభ కనబడకపోవడంతో గత నెల 24వ తేదీన రామచంద్ర భార్య కోమల బెంగళూరులోని కాడగూడి పోలీస్‌స్టేషనులో, 26న తన భార్య శోభ కనబడడం లేదని గిరీష్ హిందూపురంలో ఫిర్యాదు చేశారు. అయితే బుధవారం రామకుప్పం మండలం చెలిమిచేను అటవీ ప్రాంతంలో అపస్మారక స్థితిలో రామచంద్ర భార్య కోమలకు ఫోన్ చేసి తాను, శోభ పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు చెప్పాడు. వారిని స్థానికులు 108లో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు శవాలను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

మాస్టార్లు



''తరగతి గది ఒక ప్రసూతి గది.. జ్ఞానానికి జన్మనిచ్చేందుకు తరగతి గది ఒక శ్మశాన వాటిక.. అజ్ఞానాన్ని ఖననం చేసేందుకు తరగతి గది ఒక కర్మాగారం. జాతి భవితను నిర్మించేందుకు తరగతి గది ఒక న్యాయస్థానం. సరైన నిర్ణయాలు తీసుకునేందుకు మంచి వేదిక''

– మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన మాటలు

గురువు.. మూడక్షరాలే అయినా తరాలను మార్చే సత్తా ఉంది. ఉపాధ్యాయుడు చూపిన మార్గంలో నడవడంతో పాటు పుస్తక పాఠాలు, జీవిత అనుభవాలను నేర్చుకుంటే చాలు. అందరిలో స్ఫూర్తి నింపుతూ శిష్యుల భవితను తీర్చిదిద్దడంలో గురువు పాత్ర కీలకం. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొందరు ఉత్తమ ఉపాధ్యాయులపై సాక్షి ప్రత్యేక కథనం.

- అజ్ఞానం పారదోలి.. విజ్ఞానం పంచుతున్న ఉపాధ్యాయులు
- విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్న వైనం
- ఉత్తమ ఉపాధ్యాయులైన 60 మందికి అవార్డులు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : అజ్ఞానాన్ని పారదోలి మన జీవితంలో వెలుగులు ప్రసాదించే గురువు రుణాన్ని శిష్యుడు ఏ రూపంలోనూ తీర్చుకోలేడు. అందుకే మాతృదేవోభవ.. పితృదేవోభవ.. అన్న తర్వాత గురుదేవోభవ అని..గురువుకే ఆస్థానం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అలసత్వం చూపుతారనే ఏహ్యభావం కొందరిలో ఉంది. కానీ విద్యాభివృద్ధి కోసం జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పని చేస్తూ భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారు. సొంత ఖర్చులతో విద్యాలయాలను బాగు చేయిస్తున్నారు. ఈ నెల 5వ తేదీన జిల్లాస్థాయిలో జిల్లాకేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులు 60 మందిని సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

పురస్కారాల వెంకటరత్నం



వి.కోట మండలం యల్లాగరం జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు టీచర్ వెంకటరత్నం 33 ఏళ్లుగా విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్నారు. ఇప్పటివరకు 250కి పైగా పురస్కారాలు అందుకున్నారు. ఢిల్లీ సెమినార్‌లో జాతీయ స్థాయిలో ప్రశంసాపత్రం, అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, లింకా బుక్ ఆఫ్ రికార్డులో మీదుగా అవార్డు, 2015లో డాక్టర్ సర్వేపల్లి జాతీయ పురస్కారం అందుకున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సుమతి



పలమనేరు ఉర్దూ జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్ సుమతి బహుముఖ ప్రజ్ఞాశాలి. స్కూల్‌లో పాఠాలు బోధిస్తూనూ మరోవైపు తన ఇంట్లో పేద విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్, ఆసక్తి ఉన్నవారికి సంగీతం, భరతనాట్యం శిక్షణ ఇస్తున్నారు. 2004లో ఢిల్లీలో నిర్వహించిన ఫుడ్ న్యూట్రిషన్‌లో ఉత్తమ రీసోర్స్ పర్సన్‌గా అవార్డు పొందారు.

క్రీడాకారులను తీర్చిదిద్దిన పాండ్యన్



జీడీనెల్లూరు జెడ్పీ హైస్కూల్ పీడీ సెల్వపాండ్యన్ 28 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు హాకీ నేర్పించి క్రీడాకారులు తయారు చేశారు. సర్కారు స్కూళ్లలోని విద్యార్థుల్లో 100 మందిని అంతర్జాతీయ స్థాయి హాకీ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటేలా కృషి చేశారు. ఫిజికల్ లిటరసీ పుస్తకం రూపకల్పనలో పాల్గొన్నారు. నేషనల్ హాకీ ఎంపైర్‌గా వ్యవహరించారు.

క్రీడల శిక్షణలో మేటి దేవానంద



ఐరాల హైస్కూల్ పీడీ దేవానంద 22 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ఖోఖో, సాఫ్ట్ బాల్, బేస్ బాల్, ఫెన్సింగ్ క్రీడలను నేర్పిస్తున్నారు. 6 గురు విద్యార్థులు గతేడాదిలో జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి తల్లిదండ్రుల నుంచి మన్ననలు పొందుతున్నారు.

ఉత్తముడు వెంకమరాజు



నగరి : విజయపురం మండలం శ్రీహరిపురం హైస్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు డి.వెంకమరాజు ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఈయనది వడమాలపేట మండలం ఎస్వీపురం గ్రామం. ఈయన 1998లో ఉపాధ్యాయుడిగా వృత్తిని ప్రారంభించారు. సామాజిక కార్యక్రమాల ద్వారా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా 2022లో నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

చిత్రలేఖనంలో దిట్ట దామోదర ఆచారి



యాదమరి జెడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న దామోదర ఆచారి 29 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఇటీవల ప్రకృతి పైన ఆయన గీసిన చిత్రానికి అంతర్జాతీయ స్థాయి అవార్డు దక్కింది. 2000లో జాతీయస్థాయిలో కళానిధి, 2004లో జిల్లాస్థాయి, 2010లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

డిజిటల్ టీచర్ బాలచైతన్య



వి.కోట మండలం ముదరందొడ్డి ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలచైతన్య డిజిటల్ ఉపాధ్యాయుడిగా పేరుతెచ్చుకున్నారు. శాంతిపురం, గంగవరం, పలమనేరు, వి.కోట మండల్లాలోని వివిధ పాఠశాలల్లో బయాలజీ టీచర్‌గా పనిచేసిన ఆయన రాష్ట్రస్థాయిలో రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ప్రస్తుత టెక్నాలజీని అందిపుచ్చుకుని సర్కారు స్కూళ్లలో విద్యార్థులకు డిజిటల్ బోధనలు చేస్తున్నారు.

వరద బాధితులకు డీఆర్‌డీఏ సహాయం



డీఆర్‌డీఏ తరపున వరద బాధితులకు ప్రత్యేక వాహనంలో పంపుతున్న ఆహార పొట్లాలు

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితులకు డీఆర్‌డీఏ శాఖ తరపున సహాయం అందించారు. ఆ శాఖ పీడీ తులసి, జిల్లా సమాఖ్య సభ్యులు వరద బాధితులకు తమవంతు సహాయం అందించడానికి ముందుకొచ్చారు. వరద బాధితుల ఆకలి కష్టాలు తీర్చేందుకు ఆ శాఖ తరఫున ఒంగోలులో ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసి ఆహారం తయారు చేయిస్తున్నారు. అక్కడ తయారు చేసిన ఆహారాన్ని విజయవాడ వరద బాధితులకు ప్రత్యేక వాహనాల్లో పంపుతున్నారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా విజయవాడలో కురిసిన వర్షాలకు ప్రజలు తీవ్ర అవస్థలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రజల ఆకలి కష్టాలు తీర్చేందుకు తమ శాఖ తరపున పదివేల ఆహార పొట్లాలతో పాటు, పదివేల వాటర్ బాటిళ్లు, 20 వేలు బిస్కెట్ ప్యాకెట్లు ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపినట్లు తెలిపారు.

తొమ్మిది డెంగీ కేసులు నమోదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 9 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఆగస్టు 31 నుంచి మంగళవారం వరకు జ్వరంతో వేలూరు సీఎంసీకి వెళ్లిన పలువురిని పరీక్షించగా...అందులో 9 మందికి పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరాలు అందజేశారు. బీఎన్‌ఆర్‌పేటలో రెండు కేసులు, గంగవరం, శంకరయ్యగుంట, తవణంపల్లి, ప్రశాంత్‌నగర్, పాలసముద్రం, పెనుమూరు, చవటపల్లిలో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి. దీంతో మండల, జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.

9 నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం ప్రాక్టికల్ తరగతులు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని పీవీకేఎన్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ మీరాసాహెబ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ ప్రాక్టికల్ తరగతులకు అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఈ భూమి నాదే..

- చిత్తూరులో వక్ఫ్‌బోర్డు స్థల ఆక్రమణకు టీడీపీ నేత యత్నం
- జేసీబీతో చదును చేస్తుండగా అడ్డుకున్న ముస్లింలు
- మీకు చేతనైంది చేసుకోండంటూ తిరగబడిన సదరు నేత
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తాత్కాలికంగా పనుల నిలిపివేత

చిత్తూరు కలెక్టరేట్ : అధికారం ఉందన్న అహంకారంతో జిల్లా కేంద్రంలోని కొంగారెడ్డిపల్లిలోని ఓ హోటల్ యజమాని (టీడీపీ నాయకుడు) వక్ఫ్ బోర్డు భూమిని కాజేసేందుకు సిద్ధమయ్యాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆ స్థలం జోలికి వెళ్లని ఆ నేత బుధవారం జిల్లా కేంద్రంలోని హైరోడ్డులో సర్వే నంబర్ 602/1ఏ లో 6.31 ఎకరాల వక్ఫ్‌బోర్డు స్థలాన్ని జేసీబీతో చదును చేసేందుకు యత్నించాడు. ఇది తెలిసి పలువురు ముస్లింలు ఆ పనులు ఆపాలని డిమాండ్ చేశారు.

రూ.కోట్ల విలువ చేసే భూమి కొట్టేసేందుకు..

జిల్లా కేంద్రంలోని హైరోడ్డు వద్ద శేషాపిరాన్ మసీదు పక్కన ఉన్న సర్వే నంబర్ 602/1ఏ వక్ఫ్‌బోర్డుకు చెందుతుందని ఏపీ వక్ఫ్‌బోర్డు 1962 జూన్ 28వ తేదీన 2880 సీరియల్ నంబర్‌లో గెజిట్ ప్రచురించారు. ఆ భూమిపై కన్నేసిన కొంగారెడ్డిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు (హోటల్ యజమాని) 6.31 ఎకరాలు తాను కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు సృష్టించుకున్నారు. వాటిని అడ్డు పెట్టుకుని 2017 నుంచి కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పట్లో ముస్లింలు అడ్డుకుని గొడవలు చేశారు. మళ్లీ 2019లో చిత్తూరుకు ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన చంద్రబాబునాయుడుకు ముస్లింలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వక్ఫ్‌బోర్డు స్థలం సమస్యను పరిష్కరించి ముస్లింలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత 2019 అనంతరం వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ నేత సంబంధిత భూమి జోలికి వెళ్లలేదు. ముస్లింల ఫిర్యాదు మేరకు రెండేళ్ల కిందట రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్ స్వయంగా చిత్తూరులోని ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలం వక్ఫ్‌బోర్డుకే చెందుతుందని బోర్డు సైతం నాటించారు.



వక్ఫ్ బోర్డు స్థలాన్ని జేసీబీతో చదును చేయిస్తున్న దృశ్యం

ముస్లింల ఆగ్రహం..

గత ఐదేళ్లు ఏమీ చేయలేకపోయిన టీడీపీ నాయకుడు తాజాగా వక్ఫ్‌బోర్డు స్థలాన్ని చదును చేయిస్తున్నాడనే విషయం తెలిసి ముస్లింలు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో సదరు నేత వారిపై తిరగబడ్డాడు. ''ఎవరికి చెబుతారో చెప్పుకోండి...మీ వల్ల ఏమయితే అది చేసుకోండి'' అంటూ బెదిరించాడు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఒకటో పట్టణ పోలీసులు కూడా స్పందించలేదని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆ నేత తాత్కాలింగా పనులు ఆపాడు.

ఎస్‌పీఎస్ ప్రకాష్ ఆక్రమణకు యత్నం..



జిల్లా కేంద్రంలో హైరోడ్డు వద్ద సర్వే నంబర్ 602/1ఏ భూమి వక్ఫ్‌బోర్డుది. ఈ భూమిని టీడీపీ నాయకుడు ఎస్‌పీఎస్ ప్రకాష్ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ భూమిని కాపాడాలని 2019లో చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆక్రమించుకునేందుకు చూస్తున్నారు. వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం కాపాడాలి. న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు ఏకతాటిపైకి వచ్చి తీవ్ర ఆందోళనలకు సిద్ధమవుతాం. – **అఫ్జల్ ఖాన్, ఏపీ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు**